క్లుప్తంగా

భారీ అన్నదానం



అన్నదానం చేస్తున్న అలపన కనకరెడ్డి

జగదాంబ : శ్రీరామ నవమిని పురస్కరించుకుని పాత బస్టాండ్ దరి రామాలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 35వ వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగ

దాబాగార్డెన్స్ : ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థులపై విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి సెగ రాజుకుంటోంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు ప్రకటించిన టికెట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలుగా పని చేస్తున్న వారందర్నీ కాదని, కనీసం కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకోని వ్యక్తులకు టికెట్లు కేటాయించడంతో అసంతృప్తితో ఉన్నారు. ఈ విషయమై విశాఖ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్ స్పందిస్తూ పార్టీకి సంబంధం లేని వ్యక్తులకు, ఏ రోజూ కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకోని వారిని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఎంపిక చేయడం సాంప్రదాయ కాంగ్రెస్ వాదులను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు తెలిసి జరిగిందో, తెలియక జరిగిందో అర్థం కావడం లేదన్నారు. అభ్యర్థుల ఎంపికలో జరిగిన పొరపాటు వల్ల మరోసారి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు దగ్గరయ్యే అవకాశాన్ని చేజార్చుకున్నట్టు అయ్యిందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జగదాంబ : గుర్తు తెలియని మృతదేహం గురించి గురువారం హార్బర్ పోలీసులకు సమాచారం అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. పోర్టులోని ఎఫ్ఆర్పీ టెక్ కంపెనీలోని వంతెన నిర్మాణ పనుల వద్ద వానపల్లి సత్యనారాయణ అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతను కాలువ వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా అక్కడ గుర్తు తెలియని మృతదేహాన్ని చూశాడు. వెంటనే పోర్టు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతుడు 5 అడుగుల 5 అంగుళాల ఎత్తు, తెల్లని ఛాయతో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796013 నంబర్‌కు సమాచారం అందజేయాలని హార్బర్ పోలీసులు తెలిపారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

సీతంపేట: వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పార్వతీశ్వరాలయం వద్ద శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్టు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్య కలశాలతో వేదమంత్రాల మధ్య సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుల పంచలోహ విగ్రహాలకు పట్టాభిషేకం జరిపించారు.

నిరుద్యోగులకు అండగా నిలవాలి

బీచ్ రోడ్డు: గడిచిన ఐదేళ్లలో నిరుద్యోగులకు అండగా నిలిచి లక్షల ఉద్యోగాలు కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత పెద్ద ఎత్తున జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని రాష్ట్ర నిరుద్యోగుల జేఏసీ అధ్యక్షుడు హేమంత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. అర్హత కోల్పోయిన అభ్యర్థులకు సైతం గ్రేస్ మార్కులు వేసి 34 వేల మందికి సచివాలయంలో ఉద్యోగులు కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు ఎంతో చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చట్ట సభల్లో కూడా అవకాశాలు కల్పించాలని కోరారు.

జగన్ వెంటే జనం

- వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు
- అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలని స్పష్టీకరణ

కనీవినీ ఎరుగని రీతిలో దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీలో చేరికలు నమోదవుతున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, సామాన్యులు పార్టీలో చేరుతున్నారు. సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా వాసుపల్లిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు తెలిపారు.



వాసుపల్లికి మద్దతు తెలుపుతున్న న్యాయవాది మహ్మద్ రసూల్



వైఎస్సార్‌సీపీలో చేరిన మత్స్యకార కుటుంబాలు

దాబాగార్డెన్స్ : మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు (పులి రాజు) నేతృత్వంలో పెద్దమ్మవారి శ్రీరామ మందిరం కొత్త జాలారిపేటకు చెందిన 50 మత్స్యకార కుటుంబాలు గురువారం వాసుపల్లి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మత్స్యకారులకు ఏం కావాలో అది అందించగలన్నారు. ఎంపీగా బొత్స ఝాన్సీ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గనగళ్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 37వ వార్డు జబ్బరతోట నుంచి ఉమ్మడి హరిబాబు (రఫా), వాసుపల్లి ధనరాజు సంయుక్త ఆధ్వర్యంలో వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సారథ్యంలో 200 మంది జనసేన యువత పార్టీలో చేరారు. వీరందరికీ వాసుపల్లి పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా ప్రతి వారం ప్రజాదర్బార్ నిర్వహించి, ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపానన్నారు. యువత అంతా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. పార్టీలో చేరిన యువత మాట్లాడుతూ వాసుపల్లి సేవలకు ఆకర్షితులమై, ఏమీ సాధించలేని జనసేనను వీడామన్నారు. పార్టీలో చేరిన వారిలో గరికిన ఎల్లాజీ, వాసుపల్లి శ్యామ్‌కుమార్, సీహెచ్ యశ్వంత్, కె. తరుణ్, జి. సాయి, టి. మోహన్, దూడ ఆది తదితరులు ఉన్నారు.

పార్టీలో చేరిన మైనార్టీలు..

జీవీఎంసీ 38వ వార్డుకు చెందిన పలువురు మైనార్టీలు వాసుపల్లికి మద్దతు పలికారు. మైనార్టీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ అదిల్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పార్టీలో చేరారు. వీరందరికీ వాసుపల్లి కండువా కప్పారు. ముస్లిం మైనార్టీల 95 శాతం ఓటింగ్ వైఎస్సార్‌సీపీకేనని, మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీ ప్రభుత్వంతో జతకట్టిన రోజే టీడీపీ, జనసేన కూటమి ఓడిపోయిందన్నారు. పార్టీలో చేరిన వారిలో వక్ఫ్‌బోర్డు సభ్యురాలు ఆశా బేగం, ఆది, అక్బర్, ఐషా, స్వప్న, చిన్ని, ఇంతియాస్ తదితరులు ఉన్నారు.

34వ వార్డు నుంచి టీడీపీ, జనసేన నాయకుల చేరిక..

జీవీఎంసీ 34వ వార్డుకి చెందిన 30 మంది జనసేన, టీడీపీ వార్డు నాయకులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి

వాసుపల్లికి కళాబృందం మద్దతు..

వాసుపల్లి గణేష్‌కుమార్‌కి మద్దతుగా జనం పాట ధూమ్ ధాం కళాబృందం ఆయన సేవలపై గీతాలు ఆలపించి ఉత్సాహపరిచింది. వరంగల్ జిల్లా నుంచి వచ్చిన సింగర్, రైటర్ వల్లందాస్ వెంకన్న బృందం వాసుపల్లికి శుభాకాంక్షలు తెలిపింది. దక్షిణ నియోజకవర్గంలో వాసుపల్లి చేసిన అభివృద్ధి, పేదలను ఆదుకున్న పరిస్థితులపై పాట రూపంలో పాడి అలరించారు.

39వ వార్డు నుంచి చేరిన జనసేన, టీడీపీ కార్యకర్తలు..

జీవీఎంసీ 39వ వార్డు నుంచి వాసుపల్లి సమక్షంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం నేతృత్వంలో రామకృష్ణావీధి నుంచి సుమారు వంద మంది వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి వాసుపల్లి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టి. సురేష్, పి. బాబి, ఎం. వినోద్, వి. మోహన్, కె. హేమంత్‌కుమార్, క్రాంతి, ఆర్. వెంకట్ ఉన్నారు.

వాసుపల్లికి చారిటబుల్ ట్రస్ట్ మద్దతు..

ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచే వాసుపల్లి గణేష్‌కుమార్‌ని తామంతా గెలిపించుకుంటామని ఇన్నా అల్లాహ్ మదాద్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. 39వ వార్డుకి చెందిన వీరంతా కోటవీధి, అంబుసరంగ్ వీధికి చెందిన వారు. వీరికి వాసుపల్లి కండువా కప్పారు. ఎండీ ముస్తాఫా, ఎండీ రిజ్వాన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన కన్వేయర్‌బెల్ట్ ప్రాంతం జనసేన యువత..

జీవీఎంసీ 39వ వార్డు నుంచి భారీగా జనసేన యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో సుమారు వంద మంది కన్వేయర్ బెల్ట్ ప్రాంతానికి చెందిన జనసేన యువత వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో జి. సతీష్‌కుమార్, జి. కనకరాజు, నరేంద్ర, గోవింద, వీర్రాజు, మహేష్, రామారావు, ఎస్ఎస్ సతీష్, ప్రసాద్, శ్రీనివాస్ ఉన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన యువత



పార్టీలో చేరిన మైనార్టీలు



వాసుపల్లికి మద్దతు పలికిన ధూం ధామ్ కళా బృందం సభ్యులు



పార్టీలో చేరిన 39వ వార్డుకి చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు



తోట పద్మావతి నేతృత్వంలో పార్టీలో చేరిన వారికి కండువా కప్పిన వాసుపల్లి



32వ వార్డు నుంచి పార్టీలో చేరిన మహిళలు, యువతతో వాసుపల్లి



వాసుపల్లితో ఇన్నా అల్లాహ్ మదాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు



వాసుపల్లితో కన్వేయర్ బెల్ట్ ప్రాంతానికి చెందిన జనసేన యువత

సుభోజనం కౌంటర్ పునరుద్ధరణకు శ్రీకారం

మహారాణిపేట : కేజీహెచ్‌లో సుభోజనం కౌంటర్ పునరుద్ధరణకు గురువారం శంకుస్థాపన చేశారు. రోగుల సహాయకుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో వారి కోసం సుభోజనం కౌంటర్ ఎదురుగా ఖాళీ స్థలంలో తాత్కాలిక షెడ్ నిర్మిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అంకురార్పణ చేశారు. గత 12 సంవత్సరాల నుంచి అల్పాహారం, రెండు పూటల భోజనాలు పెడుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ చారిటీస్‌కు ఒక ఏడాది కాలం పాటు అన్నదానం చేయడానికి ఇండో ఎంఐఎం సంస్థ ముందుకు వచ్చింది. ఈ రోజు నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 17 వరకు రోజుకు 400 మంది రోగి సహాయకులకు భోజనం కోసం ఇండో ఎంఐఎం సంస్థ విరాళం ఇచ్చింది. ఈ కార్యక్రమాన్ని ఎంఐఎం కంపెనీ సీఈవో విజయకుమార్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. కంపెనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయకుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండ్ డాక్టర్ రాధాకృష్ణ, హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. భక్తదాస, జాతీయ అవార్డు గ్రహీత ఆర్. రవికుమార్, యదురాజా దాస, గోపీశ్వర దాస, శ్యామా మాధవ దాస, జీతమిత్ర దాస, సమన్వయకర్త పి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.



సుభోజనం కౌంటర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం. చిత్రంలో డాక్టర్లు అశోక్‌కుమార్, బుచ్చిరాజు తదితరులు

బరి తెగింపు..

- ఎన్నికల ప్రచారానికి ప్రభుత్వ ఆస్తుల వినియోగం
- 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకుటి నారాయణరావు నిర్వాకం

దాబాగార్డెన్స్ : అతనొక ప్రజా ప్రతినిధి. పార్టీలోని కార్యకర్తలు గానీ, ఇతరులెవరైనా ఎన్నికల నిబంధనలు పాటించకపోతే హెచ్చరించాలి. అయితే అలా చెప్పాలంటే ముందుగా ఆ నాయకుడికి ఆ నిబంధనలు ఏమిటో తెలియాలి కదా.. ఒక వేళ తెలిసినా బరితెగింపో ఏమో గానీ నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్రచారం చేసుకుంటున్నాడు. అతనే జీవీఎంసీ 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకుటి నారాయణరావు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతుగా ఎలక్ట్రిసిటీ జంక్షన్ బాక్స్‌పై ప్రచార పోస్టర్లు అంటించాడు. సార్వత్రిక ఎన్నికల్లో ఇష్టానుసారంగా ప్రచారం చేసుకోవడానికి వీల్లేదు. బరితెగించే రాజకీయ పార్టీలను దృష్టిలో పెట్టుకుని, అనవసర ప్రచారానికి అడ్డుకట్ట వేయాలని, ఓటర్లు ప్రభావితులు కాకుండా చూడడం కోసం ఎన్నికల కమిషన్ కఠిన నిబంధనలు అమల్లోకి తెచ్చింది. రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు, బ్యానర్ల ప్రదర్శనకు ప్రభుత్వ ఆస్తులను ఉపయోగించరాదు. కానీ ఉరుకుటి నారాయణరావు తన వార్డులో వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతుగా విద్యుత్ సర్వీస్ పిల్లర్(డీ5/ఓపీహెచ్/డీటీఆర్-10/ఎఫ్ఎఫ్-1/5పి-2)కు వంశీకృష్ణ శ్రీనివాస్ పోస్టర్ అతికిస్తూ 'సాక్షి' కంటపడ్డాడిలా.. ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అతనిపై అధికారులు ఏ చర్యలు చేపడతారో చూడాలి.



ప్రభుత్వ ఆస్తులను ప్రచారానికి వినియోగించుకుంటున్న ఉరుకుటి నారాయణరావు

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 10 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 080810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు ఈవో పి. శ్రీనివాసులరెడ్డి చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.



కనకమహాలక్ష్మి అమ్మవారు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

కూర్మన్నపాలెం: ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేట్ సమీపంలో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. అందులో భాగంగా గురువారం స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ లీడర్ రామనారాయణ, హెడ్ కానిస్టేబుల్ అప్పారావు వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా రామనారాయణ మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నామన్నారు. ఏ వాహనంలోనైనా 50 వేలకు పైబడి నగదు ఉన్నట్లు గుర్తిస్తే దానికి సంబంధించి సరైన ఆధారాలను చూపించాలని, లేకుంటే ఆ నగదును సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

మహారాణిపేట : అదానీ గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కి కోకింగ్ కోల్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం విశాఖ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు వల్ల సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులైన గంగవరం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన 600 కుటుంబాలకు పోర్టులో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చారని, గత 10 ఏళ్లుగా పని చేస్తున్నా రూ. 15 వేలకు మించి వేతనం ఇవ్వడం లేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణపై క్యాబినెట్‌లో తీర్మానం చేయలేదన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు పోరాటం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు కార్మికులు దృఢ సంకల్పంతో ఉన్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా, కార్మికుల ఉద్యమాల ముందు తలవంచక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ప్లాంట్ ఆర్చి వద్ద 1162వ రోజు, గురువారం దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే ఉక్కు అధికారులకు త్వరలోనే తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకు వచ్చినా అడ్డుకుంటామన్నారు. పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా ఏర్పడిన సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలి



పార్టీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

- 22న సీఎం జగన్ రోడ్ షో
- నియోజకవర్గ నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ఈ నెల 20 శనివారం నామినేషన్ వేయనున్న దృష్ట్యా గురువారం ఆశీల్‌మెట్ట అశోక్ నగర్‌లో గల తన కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. నామినేషన్ ప్రక్రియకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు సిరులతల్లి కనకమహాలక్ష్మి పాదాల చెంత నుంచి ప్రారంభమై టర్నర్ చౌల్ట్రీలో గల ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. అలాగే 22న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు షో మన ప్రాంతంలో కూడా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని వార్డుల ప్రజల నుంచి మంచి స్పందన లభించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, పలు వార్డులకు చెందిన కార్పొరేటర్లు, వార్డు నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ఆలయ చైర్మన్లు పాల్గొన్నారు.

కోకింగ్ కోల్ సమస్య యాజమాన్యం సృష్టే

దాబాగార్డెన్స్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించిన 33 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మొదటి విభాగమైన కోక్ ఓవెన్‌కు అవసరమైన కోకింగ్ కోల్ కొరతను యాజమాన్యం సృష్టించిందని, అందుకు బాధ్యులైన స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్‌ను వెంటనే తొలగించాలని సిటు రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోక్ ఓవెన్‌లో ముడిసరుకు అయిన 30 వేల టన్నుల కోకింగ్‌కోల్ గంగవరం స్టాక్ యార్డ్‌లో ఉందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు, గంగవరం పోర్టుకు మధ్య గోడే అడ్డుగా ఉందని, గంగవరం పోర్టులో ఉన్న కోకింగ్ కోల్‌ను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు రప్పించలేకపోయారని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా దెబ్బ తీయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం, గంగవరం పోర్టు యాజమాన్యం కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. దీనికి నిరసనగా ఈ నెల 21న స్టీల్‌ప్లాంట్ వద్ద కార్మిక గర్జన నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

23న పోలమాంబ జాతర


ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో కె.గాయత్రి తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 22న తొలేళ్ల ఉత్సవం, 23న అనుపు మహోత్సవం జరుగుతుందన్నారు. 23వ తేదీ ఉదయం 3 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. పంచామృతాభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.1516 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం రూ.50, విశిష్ట దర్శనం రూ. 100, ప్రత్యేక లఘు దర్శనం రూ.500 క్యూలైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు, జీవీఎంసీ, వైద్యారోగ్య శాఖ, వలంటీర్లు, ఆలయ సిబ్బంది సహకారంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న ఈవో గాయత్రి

నేత్రపర్వం.. కుంచుమాంబ అనుపోత్సవం

గాజువాక : చినగంట్యాడ గ్రామ దేవత కుంచుమాంబ అనుపోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పండగ సందర్భంగా కణితి రోడ్, ఆలయం ప్రాంగణం ధవళకాంతులతో కళకళలాడాయి. గాజువాక పోలీస్ స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అమ్మవారి ఆలయంలో గురువారం తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గాజువాక, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. యువకుల పులివేషాలు, తప్పెటగుళ్లు, బల్ల వేషాలు, మహిళల కోలాటాలతో అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు